సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం, 10, జూన్, 2023



అక్షరాభ్యాసానికి ఏర్పాట్లు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసానికి ఏర్పాట్లు చేస్తున్నారు. - 8లో



కేసీఆర్ పాలనలో సుభిక్షం

కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. - 9లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42°/29°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలీసు అధికారులకు స్థాన చలనం

భువనగిరి : జిల్లాలో పలువురు పోలీసు అధికారులకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి పట్టణ సీఐగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణను భువనగిరి రూరల్ సీఐగా, భువనగిరి రూరల్ సీఐ వెంకటయ్యను స్పెషల్ బ్రాంచ్‌కు అటాచ్ చేశారు. భువనగిరి సీసీఎస్‌లో పనిచేస్తున్న వైబీ రవీందర్‌ను సైబర్ క్రైమ్‌కు, మల్కాజిగిరి సీసీఎస్ నుంచి ఎల్. రవీందర్ భువనగిరి పట్టణ ఎస్‌ఐగా రానున్నారు. చౌటుప్పల్ ఎస్‌ఐ పాండు చైతన్యపురికి, బి.సైదులు సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. అదే విధంగా యాదగిరిగుట్టలో పనిచేస్తున్న ఎస్‌ఐ శేఖర్ చెర్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు, ఎల్‌బీనగర్ సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎస్.సైదులును చౌటుప్పల్‌కు బదిలీ చేశారు.

ఘనంగా ఊంజలి సేవ



ఊంజలి సేవ నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి, ఆలయ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో ఊంజలి సేవ జరిపించారు. ఇక ప్రధానాలయంలో సుప్రభాతం, ఆరాధన, అర్చనలు, నారసింహ హోమం, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవోత్సవం నిర్వహించారు. నిత్యాదాయం రూ.22,52,242 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

రూ.50 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యం



మాట్లాడుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలంలో రైతులకు రూ.50 కోట్ల పంట రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన డీసీసీబీ బోర్డు సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేందర్‌రెడ్డి మాట్లాడారు. ఈ నెల 28న బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించాలని, విద్యా రుణాలను రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పెంచాలని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా భూములను తనఖా పెట్టుకుని గృహ రుణాలను ఇవ్వాలని, రిజర్వ్ బ్యాంకు ఉమ్మడి జిల్లాకు మంజూరు చేసిన ఆరు కొత్త బ్రాంచీలను ఈ నెలా ఖరుకు, ఏటీఎంలతో సహా ప్రారంభించాలని సమావేశంలో తీర్మానించామని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలి, వాన బీభత్సం



చీమలకొండూరు రోడ్డుపై కూలిన చెట్టు

భువనగిరి, వలిగొండ : జిల్లాలో శుక్రవారం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. భువనగిరి మండలంలో చీమలకొండూరు, ముస్త్యాలపల్లి, చందుపట్ల, వీరవెల్లి, కూనూరు గ్రామాల్లో చెట్లు కూలిపోయాయి. కరెంట్ స్తంభాలు విరిగిపడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇక వలిగొండ మండలంలోని మల్లేపల్లి, జంగారెడ్డిపల్లెలో కోళ్లఫారాల పైకప్పులు ధ్వంసమయ్యాయి. లోతుకుంటలో శ్రీలక్ష్మీ నర్సింహస్వామి రైస్ మిల్, హనుమాన్ రైస్ ఇండస్ట్రీలోని షెడ్ల పైకప్పు రేకులు గాలికి ఎగిరిపోవడంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. పులిగిల్లలో ఇంటిపై కప్పు ధ్వంసం ఐంది. సుమారు 40 స్తంభాలు నేలకొరిగాయి.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి

ఆలేరురూరల్ : దళితులకు చెందిన 135 ఎకరాల భూములను బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధి ఆక్రమించుకున్నాడని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తిరిగి నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆలేరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితులకు భూములు దక్కే వరకు దళితులకు దక్కే వరకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు.

రూ.50 కోట్ల భూమికి ఎసరు!



బీబీనగర్ మండలం కొండమడుగు దారిలో ఉన్న వసంతకు చెందిన భూమి ఇదే



1982లో వసంత పేరున రిజిస్ట్రేషన్ అయిన పత్రాలు

స్వాహా చేసేందుకు అక్రమార్కుల యత్నం

- నకిలీ పత్రాలు సృష్టి
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఆగని రిజిస్ట్రేషన్
- మొత్తం 10 ఎకరాలు
- ఇప్పటికే 4.23 ఎకరాలు రిజిస్ట్రేషన్

సాక్షి,యాదాద్రి : నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి రూ.50 కోట్లు విలువ చేసే ఇతరుల భూమి ఆక్రమణ వెలుగు చూసింది. బీబీనగర్ మండలం కొండమడుగు రెవెన్యూలో జాతీయ రహదారి 163 పక్కన 10 ఎకరాల వ్యవసాయ భూమిని అక్రమార్కుల కాజేస్తున్నారు. తప్పుడు ఆధార్ కార్డు సృష్టించి 4.23 ఎకరాల భూమి ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేశారు. అధికార పార్టీ ముఖ్యనాయకుడు, రెవెన్యూ అధికారుల అండదండలతో సాగిన ఈ భూ కుంభకోణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బీబీనగర్ మండలం కొండమడుగు రెవెన్యూ పరిధిలో గల 591, 592, 595 సర్వే నెంబర్ పరిధిలో 10.02గుంటల భూమి ఉంది. 1982లో హైదరాబాద్ చిక్కడపల్లికి చెందిన వసంత అనే గృహిణి బీబీనగర్ మండలం కొండమడుగుకు చెందిన రాంపల్లి ఈశ్వరయ్య వద్ద కొనుగోలు చేసింది. భూమి కొనుగోలు చేసిన నాటి నుంచి ఆ భూమిపై కబ్జాలోకి ఎవరూ రాలేదు. కానీ, పహాణీలో మాత్రం వసంత పేరు వస్తోంది. అయితే, తమకు చెందిన ఉమ్మడి ఆస్తి అంటూ ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు అప్పుడప్పుడు ఆ భూమిని కొంత సాగుచేస్తున్నారు.

ధరణితో వెలుగులోకి

ధరణితో వసంత భూమి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పహాణీలో వస్తున్న భూమి రికార్డుల ఆధారంగా రెవెన్యూ అధికారులు 1–బి ఇవ్వడానికి వసంత చిరునామా వెతుక్కుంటూ వెళ్లగా అక్కడ వసంత లేదన్న విషయం బయట పడింది. దీంతో బీబీనగర్ మండలానికి చెందిన అధికార పార్టీ ముఖ్య నాయకుడొకరు రంగంలోకి దిగి.. భూ యజమానురాలు వసంత పేరుతో ఓ మహిళను రంగంలోకి దించారు. ఆమె పేరున భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం జారీచేయించారు. మరో ముగ్గురు మహిళలు వసంత పేరుతో భూమి తమదేనంటూ వెలుగులోకి వచ్చారు.

ఆధార్‌కార్డు ఎడిట్ చేసి..

వసంత పేరుతో ఆధార్‌కార్డును ఎడిట్‌చేసే క్రమంలో తప్పు చేశారు. వసంత తండ్రి దొరైస్వామి కాగా తాజాగా నారాయణరావుగా మార్చారు. వసంత తండ్రిగా పేర్కొన్న నారాయణరావును చిరునామాలో మాత్రం వసంత కేరాఫ్ నారాయణరావుగా పేర్కొన్నారు. 1982 రిజిస్ట్రేషన్ చేసినప్పుడు వసంత తండ్రి దొరైస్వామి ఉంటే ప్రస్తుతం ఆధార్‌కార్డులో తండ్రి నారాయణరావు అని చేశారు. రిజిస్ట్రేషన్ రికార్డులను పరిశీలించుకుండానే రెవెన్యూ అధికారులు వసంత పేరుతో టీఎస్ 30060050845 నంబర్‌తో పట్టాదారు పాస్‌పుస్తకం జారీ చేశారు.

ఆగని రిజిస్ట్రేషన్

పలు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా బీబీనగర్ తహసీల్దార్, రెండు విడతలుగా నాలుగున్నర ఎకరాలకు పైగా భూమి ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేశారు. తమకు చెందిన భూమిని తప్పుడు ఆధారాలతో ఇతరులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఈ యేడాది ఏప్రిల్ 6న రాంపెల్లి ఈశ్వరయ్య సోదరుడి కుమారుడు రాంపెల్లి రమేష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆరోజు నిలిపివేసిన రిజిస్ట్రేషన్‌ను నాలుగు రోజుల తర్వాత అంటే ఏప్రిల్ 10న సర్వేనంబర్ 595బై1లో కృష్ణమూర్తి యాదవ్ పేరున ఒక ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు పాస్‌బుక్ జారీ చేశారు. అలాగే ఏప్రిల్ 21న 595బై1 సర్వే నంబర్‌లో 3.23 ఎకరాల భూమిని వసంత పేరు నుంచి సుహాసిని పేరున రిజిస్ట్రేషన్ చేసి పాస్‌బుక్ జారీచేశారు. వసంత పేరున 10 ఎకరాల భూమి కొండమడుగు వద్ద ఉందని తెలియడంతో నలుగురు వృద్ధ మహిళలు తామే వసంతలమంటూ తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి



కుంభకోణానికి ప్రధాన బాధ్యులైన అధికార పార్టీ నాయకులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి. కొండమడుగు రెవెన్యూ పరిధిలోని 591, 592, 595 సర్వే నంబర్లలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌లని వెంటనే రద్దుచేసి ఎవ్యాక్యు ప్రాపర్టీగా (ఎవరికీ చెందని) గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. ఈ మొత్తం తతంగానికి ప్రధాన సూత్రధారి బీబీనగర్ తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి.

– పిట్టల అశోక్, బీబీనగర్

నిబంధనల ప్రకారమే చేశాం

కొండమడుగు రెవెన్యూ పరిధిలో వసంత పేరుతో 4.23 ఎకరాల రిజిస్ట్రేషన్లు నిబంధనల ప్రకారమే చేశాం. ఆ భూమి తమదేనంటూ ముగ్గురు వసంతలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఢిల్లీ చిరునామా పేరుతో ఉన్న వసంత ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఆమె రద్దు చేసుకున్న జీపీఏ వివరాలు ఒకే విధంగా ఉండటంతో ధరణిలో స్లాట్ బుక్ చేసి రిజిస్ట్రేషన్ చేశాం. వివాదంలో ఉన్నటువంటి ఈ భూమిపై ఎలాంటి లీగల్ సమస్యలు వచ్చినా, తప్పుడు వివరాలు ఇచ్చినట్టు తేలినా వసంతపై చర్యలు తీసుకుంటాం.

–అశోక్‌రెడ్డి తహసీల్దార్, బీబీనగర్

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం



గొర్రెల యూనిట్లు పంపిణీ చేసిన అనంతరం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి గొర్రె పిల్లను బహూకరిస్తున్న గొల్లకురుమలు

- అసాధ్యాలను సుసాధ్యం చేసిన ఘనత కేసీఆర్‌ది
- సంక్షేమ సంబురాల్లో ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని, సీఎం కేసీఆర్ అసాధ్యాలను సుసాధ్యం చేసి చూపుతున్న గొప్ప నాయకుడని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన సంక్షేమ సంబురాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉండాలన్న ధ్యేయంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించడానికి జిల్లాలో బస్వాపూర్ వద్ద రిజర్వాయర్ నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో పూడికతీయడం వల్ల వేసవిలోనూ చెరువులు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి కష్టాలు తొలగించారని, రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో నిరుపేదల కుటుంబాల్లో ధైర్యం నింపుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కుల, చేతి వృత్తుదారుల వారికి లక్ష రూపాలయ ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం దళితబంధు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, చేనేత, గొల్ల కురుమలకు చెక్కులు, గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టరు దీపక్ తివారీ, మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ అమరేందర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అమరేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి.ఎంపీపీలు, జెడ్పీ చైర్మన్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యాదాద్రి భూముల్లో బోర్డులు ఏర్పాటు



రంగారెడ్డి జిల్లా కనకమామిడిలో యాదాద్రి భూముల్లో ఏర్పాటు చేసిన బోర్డు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి భక్తులు విరాళంగా ఇచ్చిన భూముల్లో ఆలయ అధికారులు శుక్రవారం సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న దేవస్థానం భూములను కాపాడేందుకు చర్యలు చేపట్టారు. యాదాద్రి దేవాలయానికి రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామంలో దాతలు ఒకచోట ఎకరం 27గుంటలు, మరోచోట ఎకరం భూమిని విరాళంగా ఇచ్చారు. దీంతో ఈ భూమిని దేవస్థానం ఈవో గీతారెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించి, అక్కడ సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. యాదాద్రి దేవస్థానం భూమి పేరుతో బోర్డులు నాటారు. అనంతరం భూమి ఇచ్చిన దాతలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు సత్యనారాయణశర్మ, ఉప కార్యనిర్వాహణ ఇంజనీర్ మహిపాల్‌రెడ్డి, కనకమామిడి సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్.. కుర్చీ దొరకలేదా?



చందంపేట మండలంలో కొనసాగుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర

- నక్కలగండి ఎందుకు పూర్తి చేయలేదు
- అభివృద్ధి పేరుతో పేదల భూములు గుంజుకున్నారు
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

చందంపేట : నక్కలగండి ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని కూర్చుని పనులు పూర్తి చేయిస్తానని ఎన్నికల సమయంలో చెప్పిన కేసీఆర్‌కు కుర్చీ దొరకలేదా అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం చందంపేట మండలంలోని ముర్పునూతల, జగ్గుతండా, గన్నెర్లపల్లి, పోలెపల్లి, బిల్డింగ్ తండా మీదుగా దేవరకొండ మండలంలోని మైనంపల్లి, కొర్రతండా సమీపం వరకు సాగింది. ఈ సందర్భంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన కూలీలతో భట్టి మాట్లాడారు. పలువురు రైతులు ఎదురొచ్చి ఆయనకు సమస్యలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల భట్టి విక్రమార్క మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అదనంగా ఒక్క ఎకరాకైనా నీరిచ్చారా అని ప్రశ్నించారు. ఎస్సెల్బీసీ టన్నెల్‌ను ఎందుకు పూర్తి చేయలేదని అన్నారు. జిల్లాలో కొత్తగా ఒక్క చెరువు అయినా నిర్మించారా? ఏ పని చేయనప్పుడు మరి ఎందుకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ధరణి సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చి పేదల భూములను పెద్దలకు దక్కేలా చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 24 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి పేదలకు పంచితే.. ధరణి ద్వారా కుట్రపూరితంగా వెనక్కి తీసుకున్నారని ధ్వజమెత్తారు. పల్లె ప్రకృతి వనాలు, కలెక్టరేట్‌లు, ఎస్పీ కార్యాలయాలు, శ్మశానవాటికలు, రైతు వేదికలను నిర్మించడానికి కూడా పేదల భూములను గుంజుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యంత సంపద కలిగిన అమెజాన్ కంపెనీకి కూడా పేదల భూములే ఇస్తున్నారని మండిపడ్డారు. హైటెక్ సిటీ వద్ద బండి పార్థసారధికి అప్పనంగా భూములు అప్పగించగా హైకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. రూ.42వేల కోట్లు ఖర్చుపెట్టి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీళ్లందిస్తున్నామని చెబుతున్న బీఆర్‌ఎస్ నాయకులు ఎన్ని గ్రామాలకు ఇచ్చారో చూపించగలరా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సేనావత్ బాలునాయక్, పీసీసీ మెంబర్ కేతావత్ బీల్యానాయక్, జగన్‌లాల్, కిషన్‌నాయక్, రవినాయక్, జాలె నర్సింహారెడ్డి, ఎంపీపీ నూన్సావత్ పార్వతి, జెడ్పీటీసీ సేనావత్ బుజ్జి, హరికృష్ణ పాల్గొన్నారు.

కార్యకర్తల మధ్య తోపులాట

చందంపేట మండలంలోని పోలేపల్లి స్టేజీ వద్ద గజమాలతో సన్మానించే క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పీసీసీ మెంబర్ డాక్టర్ రవినాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గట్టు రాజేందర్‌రెడ్డి ఒకే సమయంలో గజమాలతో సన్మానించే క్రమంలో పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహించిన భట్టి విక్రమార్క వారిని వారించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



కూలీలతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

పత్తి విత్తనాలు విత్తిన భట్టి

పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా భట్టి విక్రమార్క చందంపేట మండలంలోని గన్నెర్లపల్లిలో కూలీలతో కలిసి విత్తనాలు విత్తారు. ఈ సందర్భంగా విత్తన ప్యాకెట్ ధర ఎంత ఉందని తెలుసుకున్నారు. గత సంవత్సరం రూ.750 ఉందని, ఈ సంవత్సరం రూ.800 నుంచి రూ.1200 వరకు తీసుకుంటున్నారని రైతులు ఆయనతో చెప్పారు.

రెండో రోజు 9 రకాల వంటకాలు

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ శుక్రవారం కొనసాగింది. తొలి రోజు మూడు రకాల చేపల వంటకాలు చేయగా రెండో రోజు తొమ్మిది రకాల కూరలు చేశారు. వీటిలో చేపల పులుసు, చేపల దమ్ బిర్యానీ, చేపల ఫ్రై, కేఎఫ్‌సీ ఫిష్, అపోలో ఫిష్, ఫిషఓడా, ఫ్రాన్స్ ఫిష్ ఫ్రై, ఫూల్‌ఫ్రై ఫిష్, ఎండు చేపల పులుసు కూరలు ఉన్నాయి. స్టాల్లను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. చేపల వంటకాలను రుచి చూశారు. భోజన ప్రియులు ఫిష ఫెస్టివల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



చేపల కూరతో భోజనం చేస్తున్న మహిళలు

నేడు 'సుపరిపాలన' దినోత్సవం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

సాక్షి,యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.00 గంటలకు సుపరిపాలన దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై సుపరిపాలన దినోత్సవం ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల ఏర్పాటుతో ప్రజల ముంగిట్లోకి పాలన రావడమే గాక సులభతరంగా పర్యవేక్షిస్తున్న విషయాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నిర్వహించే కార్యక్రమాలు

- అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ వ్యవస్థలను ప్రజలకు మరింత చేరువ చేయడం వల్ల కలిగిన ప్రయోజనాలను ప్రస్తావించాలి.
- నూతన మండలాలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, రెవెన్యూ డివిజన్ల ద్వారా ప్రజలకు దూరభారం తగ్గడమే కాకుండా పాలనాపరమైన పర్యవేక్షణ సులభతరమైన విషయాన్ని పేర్కొనాలి.
- వివిధ శాఖలను పునర్ వ్యవస్థీకరణ చేయడం వల్ల ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతున్న విషయాన్ని వివరించాలి.

వేడుకల్లో పాల్గొననున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

కలెక్టరేట్‌లో నేడు నిర్వహించనున్న సుపరిపాలన దినోత్సవంలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వేడుకలు ప్రారంభం అవుతాయన్నారు.

ఇంటింటికీ వంట గ్యాస్

- పైపులైన్ ద్వారా సరఫరా
- చౌటుప్పల్‌లో కొనసాగుతున్న పనులు
- ఇప్పటికే వలిగొండ, బీబీనగర్‌లో పూర్తి
- మొదలైన కనెక్షన్ల మంజూరు ప్రక్రియ



పైపులు వేస్తున్న ఇంజనీర్లు

చౌటుప్పల్ : జిల్లాలో ఇంటింటికీ పైపులైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మెగాసిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటికే వలిగొండ, బీబీనగర్‌లో పైపులైన్ పనులు పూర్తి కాగా వారం రోజుల క్రితం చౌటుప్పల్‌లో పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ విధానం అమల్లోకి వస్తే వినియోగదారులకు గ్యాస్ భారం తగ్గనుంది.

తాళ్లసింగారం వద్ద మెయిన్ లైన్‌కు అనుసంధానం

చౌటుప్పల్ పట్టణంలో మెగా గ్యాస్ పేరిట మెగాసిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో పైపులైన్ పనులు చేపట్టారు. చౌటుప్పల్ – వలిగొండ మార్గంలో తాళ్లసింగారం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ప్రధాన లైన్‌కు గ్యాస్ సరఫరా చేయాల్సిన పైప్‌లైన్‌ను అనుసంధానించారు. ప్రస్తుతం ముత్యాల శంభారెడ్డి వ్యవసాయ క్షేత్రం నుంచి మార్కండేయ దేవాలయం మీదుగా చౌటుప్పల్ పట్టణంలోకి పైప్‌లైన్ పనులు రుగుతున్నాయి. ప్రధాన పైప్‌లైన్ వలిగొండ మండలం సుంకిశాల నుంచి రెండేళ్ల క్రితమే వేసి ఉంచారు.

150 కిలో మీటర్ల దూరం పైప్‌లైన్

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు, దుకాణాలు కలిపి 8030 నిర్మాణాలు ఉన్నాయి. పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లోని ఇళ్లకు సైతం పైప్‌లైన్ వేయనున్నారు. ఇందుకోసం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 150 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ వేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి దాదాపుగా రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ గ్యాస్‌కు పేలుడు(ప్రమాద) స్వభావం తక్కువగా ఉంటుందని కంపెనీ అధికారులు చెబుతున్నారు.

సుంకిశాల కేంద్రంగా సరఫరా

మెగాసిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వలిగొండ మండలంలోని సుంకిశాల గ్రామంలో ప్రధాన సరఫరా కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడికి కొన్నేళ్ల క్రితమే విశాఖపట్నం నుంచి ప్రత్యేక పైప్‌లైన్ వేశారు. పైప్‌లైన్ ద్వారా వచ్చే గ్యాస్‌ను ఇక్కడ నిల్వ చేస్తారు. ఇక్కడి నుండి జిల్లాలోని వివిధ పట్టణాలు, మండల కేంద్రాలకు గ్యాస్ సరఫరా చేయడానికి పైప్‌లైన్‌లు వేస్తున్నారు. ఇప్పటికే యాదాద్రి జిల్లాలో వలిగొండ, బీబీనగర్‌లో పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి. గ్యాస్ కనెక్షన్లు సైతం ఇస్తున్నారు.

వినియోగదారులకు తగ్గనున్న భారం

ఇంటింటికీ గ్యాస్ సరఫరా ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. అనేక వ్యయప్రయాసాలకోర్చి సిలిండర్లను ఇంటికి తీసుకువచ్చే పరిస్థితిని అధిగమించవచ్చు. ఎదురుచూపులు తొలగిపోనున్నాయి. అవసరం మేరకే వినియోగించుకోవచ్చు. ధర విషయంలోనూ ఇతర సంస్థలు, మెగా గ్యాస్‌కు చాలా వ్యత్యాసం ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం సిలిండర్ రూ.1155 ఉండగా మెగా గ్యాస్ అందులో సగానికే అందుబాటులోకి రానుంది.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

పెదఅడిశర్లపల్లి: ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పెదఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్డు సమీపంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన వంగూరు ముత్తయ్య(56) తన సమీప బంధువు ఇంట్లో జరిగే శుభకార్యానికి పీఏపల్లి మండల కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. మార్గమధ్యలో జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై గల బంక్‌లోకి పెట్రోల్ పోయించుకోవడానికి వెళ్తుండగా వెనకనుంచి వేగంగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ముత్తయ్యకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడు కుమారుడు నర్సింహ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

గీత కార్మికుడు మృతి


పాపయ్యగౌడ్ మృతదేహం

గుండాల : తాటి చెట్టు పైనుంచి జారిపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన గుండాల మండలంలోని వెల్మజాల గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తాళ్లపల్లి పాపయ్య గౌడ్ (55) రోజువారీగా తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేనేతను ఆదరించాలి


చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కావ్యారెడ్డి

భూదాన్‌పోచంపల్లి : ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేతను ఆదరించాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె పోచంపల్లిని సందర్శించారు. పట్టణకేంద్రంలోని శ్రీరంజన్ సిల్క్ ఇండస్ట్రీలో ఇక్కత్‌వస్త్రాలు, డిజైన్లను పరిశీలించారు. అనంతరం చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను ఇముడింపజేయడంలో చేనేతది మొదటి స్థానమని అన్నారు. చేనేత కళను భవిష్యత్తు తరాలకు అందించడానికి చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఆర్టీసీలో విలేజ్ బస్సు ఆఫీసర్లు

- రోడ్డు రవాణా సంస్థలో కొత్త వ్యవస్థకు శ్రీకారం
- నల్లగొండ రీజియన్‌లో 177 మంది నియామకం
- ప్రజలకు చేరువయ్యేందుకు ఆర్టీసీ వినూత్న కార్యక్రమం


మిర్యాలగూడ ఆర్టీసీ డిపో

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ సంస్థ పరిపుష్టి సాధించడంతో పాటు ప్రయాణికులకు చేరువయ్యేలా ఎప్పటికప్పుడు కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా డిపోల పరిధిలో కొత్తగా విలేజ్ బస్సు ఆఫీసర్లను నియమించింది. ప్రస్తుతం సంస్థలో పని చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి ఈ బాధ్యతలను అప్పగించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో మొదటి విడతగా 177మంది ఎంపిక చేయగా వీరికి కేటాయించిన గ్రామాల్లో ఆర్టీసీ సేవలను వివరిస్తూ ప్రయాణికులు సంస్థను ఆదరించేలా కృషి చేస్తారు. ఇప్పటికే నిర్వహించాల్సిన బాధ్యతలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వగా టిషర్ట్‌లు, విధి విధానాల పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు, గుర్తింపు కార్డులు, టిషర్టులు కూడా అందించారు.

గ్రామాల వారీగా బాధ్యతలు

నల్లగొండ రీజియన్ పరిధిలో దేవరకొండ, నల్లగొండ, నార్కట్‌పల్లి, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట, యాదగిరిగుట్ట ఏడు డిపోలుండగా వీటి పరిధిలో పెద్ద గ్రామానికి అయితే ఒకరు చొప్పున, చిన్న గ్రామం అయితే రెండు, మూడింటికి ఒక్క విలేజ్ బస్సు ఆఫీసర్లుగా బాధ్యతలను అప్పగించారు. వీరందరూ ప్రజలతో సమావేశమై బస్సుల రాకపోకల సమయం, నూతన సర్వీసులు, సమస్యల వివరాలను తెలుసుకొని అధికారులకు చెప్పాల్సి ఉంటుంది. అదే విధంగా గ్రామాల్లో పెళ్లిళ్ల, శుభకార్యాలు, జాతరలు వివరాలు సేకరించి రద్దీకి అనుగుణంగా బస్సు ట్రిప్పులు పెంచేలా కృషిచేస్తారు. శుభకార్యాలు జరిగే వారికి ఇళ్లకు వెళ్లి బస్సులు తీసుకుంటే రాయితీలను వివరిస్తారు. ఈ క్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, సంఘాల నాయకులు, ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులను సంప్రదిస్తారు. గతంలో బస్సులకు సంబంధించిన సమస్యలు ఉన్న కొత్త సర్వీసులు కావాలని, అద్దెకు బస్సులు తీసుకోవాలన్నా, గ్రామాల ప్రజలు డిపో మేనేజర్లను సంప్రదించాల్సి వచ్చేది. ఒక్కోసారి డిపోలకు వెళ్లలేక, ఫోన్ నంబర్లు అందుబాటులో లేక ప్రజలు ప్రైవేటు సర్వీసులను ఆశ్రయించే వారు. కానీ విలేజ్ బస్సు ఆఫీసర్లతో ఈ సమస్యలన్నీ తీరి ఆర్టీసీ మరింత చెరువవుతుందని భావించవచ్చు.

విలేజ్ బస్సు ఆఫీసర్లు	
దేవరకొండ	21
నల్లగొండ	40
నార్కట్‌పల్లి	12
మిర్యాలగూడ	16
కోదాడ	10
యాదగిరిగుట్ట	50
సూర్యాపేట	28

వీబీఓలు ఏం చేస్తారంటే

- సంస్థకు ప్రయాణికుల మధ్య వారధిగా పని చేయాలి.
- కేటాయించిన ప్రతి గ్రామంలో ప్రతి నెల కనీసం రెండు సార్లు ప్రయాణికుల సమావేశాలు ఏర్పాటు చేయాలి. ప్రయాణికుల అవసరాలను తెలుసుకొని అధికారులకు తెలియజేయాలి.
- గ్రామాలకు కేటాయించిన విలేజ్ బస్సు ఆఫీసర్లు ఈనెల 9 నుంచి విధులను నిర్వహిస్తున్నారు.
- ఆర్టీసీ ద్వారా అందించే సేవలను గ్రామాల్లో ప్రజలకు వివరించడమే కాకుండా సురక్ష ప్రయాణానికి ఆర్టీసీని ఆదరించాలని అవగాహన కల్పిస్తారు.
- దివ్యాంగులు, విద్యార్థులు, వృద్ధులకు అందించే రాయితీ పథకాలు, బస్సు పాసుల వివరాలను వెల్లడిస్తారు.
- గ్రామస్తుల నుంచి అందే వినతులు, ఫిర్యాదులు, సర్వీసులు అవసరమైన రూట్లు గుర్తించి ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించాల్సి ఉంటుంది.

సంస్థ సేవలను విస్తృతం చేసేలా



ప్రజలకు చేరువయ్యేందుకు ఆర్టీసీలో వస్తున్న కొత్త వ్యవస్థ ద్వారా సంస్థ సేవలను విస్తతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో ఈ వ్యవస్థ అమలులోకి వచ్చింది. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న మొదటి విడతలో 177 మంది గ్రామ ఆర్టీసీ విలేజ్ బస్సు ఆఫీసర్లు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సంస్థ సేవలను వివరిస్తూ ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తున్నాం.

–ఎస్. శ్రీదేవి, ఆర్టీసీ ఆర్‌ఎం నల్లగొండ

సూర్యాపేటకు పర్యాటక శోభ

- విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి


బోటులో షికారు చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే సైదిరెడ్డి, ఆర్డీఓ

సూర్యాపేట : సూర్యాపేటకు పర్యాటక శోభ సంతరించుకుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సద్దుల చెరువులో షికారు బోటును మంత్రి ప్రారంభించి మాట్లాడారు. సద్దుల చెరువు అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా రూపాంతరం చెందడానికి తొలి అడుగు పడిందన్నారు. శుభకార్యాలు జరుపుకునేందుకు వీలుగా త్వరలో మినీ క్రూయిజ్ షిప్ ఫైబర్ జెట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు వై.వెంకటేశ్వర్లు, ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకుని కౌన్సిలర్ బలవన్మరణం

- మానసిక ఒత్తిడి తట్టుకోలేకనే అఘాయిత్యం
- మిర్యాలగూడలో విషాదం


నాగలక్ష్మి (ఫైల్)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

మిర్యాలగూడ అర్బన్ : మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఓ మహిళా కౌన్సిలర్ బలవన్మరణానికి పాల్పడింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని 25వ వార్డు కౌన్సిలర్, శివాని హైస్కూల్ చైర్మన్ కుందూరు నాగలక్ష్మి(45) తన భర్త కుందూరు శ్యాంసుందర్‌రెడ్డితో కలిసి స్కూల్ హాస్టల్ భవనంలోని నాలుగో అంతస్తులో నివాసముంటున్నారు. తన భర్తతో కలిసి గురువారం రాత్రి ఓ వివాహ వేడుకలకు హాజరై రాత్రి పొద్దుపోయాక తిరిగి వచ్చారు. అనంతరం తన గదిలోకి వెళ్లి నిద్రించిన ఆమె శుక్రవారం ఉదయం బయటకు రాలేదు. రోజువారీ పనుల్లో భాగంగా శ్యాంసుందర్‌రెడ్డి బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చాడు. బెడ్‌రూం తలుపు వేసి ఉండటంతో ఎంతకు తలుపు రాలేదు. దీంతో అనుమానం వచ్చి తలుపును తెరిచి చూడగా నాగలక్ష్మి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ పి.వెంకటగిరి కౌన్సిలర్ బలవన్మారణానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహానికి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అమెరికాలో ఉన్న తన తమ్ముడు వచ్చే వరకు మృతదేహాన్ని భద్రపరిచేందుకు నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, నాగలక్ష్మి కొంతకాలంగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతోందని, మానసిక ఒత్తిడి తట్టుకోలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తల్లి సరోజనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కౌన్సిలర్ మృతితో మిర్యాలగూడలో విషాదం అలుముకుంది.

ఎమ్మెల్యే పరామర్శ

బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కుటుంబ సమేతంగా వచ్చి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి పంపే వరకు ఎమ్మెల్యే అక్కడే ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో ప్రజలు, వివిధ పార్టీల నేతలు చేరుకున్నారు. మృతురాలికి కుమారుడు కేశవ సుదీప్‌రెడ్డి, కూతురు జీవన సంయుక్త ఉన్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


గాయపడిన వారిని తరలిస్తున్న 108 సిబ్బంది


క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

- 24 మందికి గాయాలు

నార్కట్‌పల్లి : జాతీయ రహదారిపై మొక్కలకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 24 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి బయలుదేరింది. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన మొక్కలకు నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న సంధ్య, గోవర్ధనమ్మ, ఉమాదేవి, యశోదలకు తీవ్రగాయాలు కాగా మరో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, జీఎంఆర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు సీఐ శివరాంరెడ్డి, ఎస్‌ఐ సైదబాబు తెలిపారు. ప్రమాదానికి అతివేగంతో పాటు నిర్లక్ష్యపు డ్రైవింగే కారణమని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రుల్లో రామన్నపేటకు చెందిన ఆరుగురు ఐకేపీ సిబ్బంది, పది మంది ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నట్లు తెలిసింది. వీరంతా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నకిరేకల్‌లో నిర్వహిస్తున్న సమావేశానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

మూడేళ్లకే నూరేళ్లు !

- ట్రాక్టర్ టైర్ మీద పడి బాలుడి మృతి
- రామన్నపేటలో విషాదం

రామన్నపేట : ట్రాక్టర్ టైర్ మీదపడి మూడేళ్ల బాలుడు మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన శుక్రవారం రామన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేటకు చెందిన మోటె రాజు–శ్రీలత దంపతులది నిరుపేద కుటుంబం. రాజు వ్యవసాయ పనులతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శుక్రవారం ఉదయం రాజు ఇంటివద్ద ట్రాక్టర్ ఇంజన్ టైర్ విప్పి పక్కకుపెట్టి రిపేరు చేస్తున్నాడు. ఆ సమయంలో బలమైన గాలి వీయడంతో టైర్ సమీపంలో ఆడుకుంటున్న అతని కుమారుడు వైభవ్(3) మీద పడడంతో తీవ్రగాయాలు అయ్యాయి. కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.బాలుడి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


సరిత (ఫైల్)

కేతెపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన కేతెపల్లిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేతెపల్లికి చెందిన బంద లూర్దురాజు కూతురు సరిత (28)కు ఇదే గ్రామానికి చెందిన పసల బాలభాస్కర్‌తో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా బాలభాస్కర్‌కు అన్నదమ్ములతో భూతగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య కలహాలు చోటుచేసుకున్నాయి. దీంతో మనస్తాపం చెందిన సరిత గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శుక్రవారం మృతురాలి తండ్రి లూర్దురాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని జరుపుతున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

పోలీసు లాంఛనాలతో ఎస్‌ఐ అంత్యక్రియలు


నివాళులర్పిస్తున్న పోలీసులు, తదితరులు

నకిరేకల్ : రంగారెడ్డి జిల్లా దుండిగల్ ఎస్‌ఐ బొక్క ప్రభాకర్‌రెడ్డి (34) గుండెపోటుతో గురువారం మృతిచెందారు. ఆయన స్వగ్రామమైన నకిరేకల్‌లో శుక్రవారం పోలీస్ అధికారుల లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. దుండిగల్ జిల్లా పోలీస్ అధికారులతో పాటు 20మంది ఎస్‌ఐలు, 10మంది సీఐలు, ఇతర పోలీస్ సిబ్బంది నకిరేకల్‌కు చేరుకుని ప్రభాకర్‌రెడ్డి మృతదేహానికి, టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ సందర్శించి నివాళులర్పించారు.

మట్టపల్లిలో కృష్ణమ్మకు హారతిపూజ

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం కృష్ణానది (కృష్ణమ్మ)కి ప్రత్యేక అర్చనలతో హారతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారిని ప్రత్యేక పల్లకీ సేవతో కృష్ణానదిలో ప్రహ్లాద ఘాట్‌కు తరలించారు.అనంతరం హారతిపూజను పూర్తిగావించి ఆలయ ప్రవేశ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు రామాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి భక్తులు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణానదికి హారతిపూజ చేస్తున్న అర్చకులు

చోరీ కేసుపై పోలీసుల విచారణ

చిట్యాల: చిట్యాల పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి వెంచర్‌లో గల రియల్టర్ గంజీ రాంమూర్తి ఇంట్లో గురువారం పట్టపగలు దుండగులు చొరబడి ఆర కేజీకి పైగా బంగారు నగలతో పాటు పెద్ద మొత్తంలో నగదును తీసుకెళ్లిన కేసును పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. చోరీ జరిగిన రోజునే నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, నార్కట్‌పల్లి సీఐ కె.శివరాంరెడ్డి ఆధ్వర్యంలో క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. పోలీసుల జాగిలాలు చోరీకి గురైన రామ్మూర్తి ఇంటి నుంచి అదే వెంచర్‌లోని మరో ఇంటి చుట్టు తిరగటంతో పాటుగా రైతు వేదిక వద్ద వరకు, అటు నుంచి జాతీయ రహదారిపైకి వచ్చాయి. అనంతరం జాతీయ రహదారి నుంచి పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల కాలనీ వరకు వచ్చి తిరగాడి మరల జాతీయ రహదారిపైకి వచ్చి నిలిచిపోయాయి. చోరీ జరిగిన ఇంట్లోని సీసీ కెమెరాల మానిటరింగ్ చేసే డివైజ్‌ను సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో ఆ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, హైవేపై పక్కన గల సర్వీస్‌రోడ్ల వెంట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా పోలీసులు విచారణ చేస్తున్నారు. పట్టణంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఇంట్లో చోరీ జరగడంతో పోలీసులు కేసును సవాల్‌గా తీసుకుని విచారణ చేస్తున్నారు.

సామూహిక అక్షరాభ్యాసానికి ఏర్పాట్లు


సామూహిక అక్షరాభ్యాసానికి సిద్ధమవుతున్న వ్రత మండపం -2 హాల్

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి ఆలయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం 10గంటల నుంచి యాదాద్రీశుడి కొండకు దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం 2లో చిన్నారులకు ఉచితంగా సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తిలు శుక్రవారం వెల్లడించారు. ఇందుకు సంబంధించి వ్రత మండపం 2లో చెత్త లేకుండా, ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 100 మంది చిన్నారులు వేదుకలో పాల్గొనేందుకు వీలు కల్పించారు.

భువనగిరిలో లారీ చోరీ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు లారీని చోరీ చేశారు. ఈ ఘటన భువనగిరిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన బచ్చు సోమేశ్వర్ తన లారీని రెండు రోజుల క్రితం మార్కెట్ యార్డులో పార్కింగ్ చేశాడు. కాగా, శుక్రవారం యాజమాని నిలిపి ఉన్న లారీ కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. లారీ ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైట్ల వెలుతురులో స్పిల్‌వే మరమ్మతు పనులు


స్పిల్‌వేపై భాగంలో సెంట్రింగ్ బాక్స్‌లలో నింపుతున్న కాంక్రీట్

నాగార్జునసాగర్ : లైట్ల వెలుతురులో శుక్రవారం రాత్రి సాగర్ స్పిల్‌వే మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో పగటి పూట పనులు చేసేందుకు కూలీలు బయపడుతున్నారు. దీంతో రెండు రోజులుగా స్పిల్‌వే మరమ్మతు పనులు జాప్యంగా నడుస్తున్నాయి. ఉదయం 10గంటలు దాటితే ఎండ వేడికి స్పిల్‌వే గుంతల చుట్టు ఏర్పాటు చేసిన సెంట్రింగ్ బాక్స్‌లను పట్టుకోలేక పోతున్నారు. దీంతో అధికారులంతా గురువారం మరోసారి స్పిల్‌వే సందర్శనకు వచ్చారు. ఈఎన్‌సీ నాగేందర్‌రావు పనులను వేగవంతం చేస్తేనే తగిన సమయంలో పూర్తి అవుతాయని ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్పందించిన కాంట్రాక్టర్ మధ్యాహ్నం మూడుగంటల నుంచి పనిచేసే చోట డ్యాం నీడ పడుతుండటంతో ఆసమయంలో సెంట్రింగ్ బాక్స్‌లు మార్చుతున్నారు. లోతైన గుంతల చుట్టు సెంట్రింగ్ బాక్స్‌లు ఏర్పాటు చేసి, అపాక్స్‌ట్రీట్‌మెంటు చేస్తున్నారు. అది ఆరగానే భూమర్ సహకారంతో కాంక్రీట్ నింపుతున్నారు. ప్రతి కాంక్రీట్ పని జరిగే చోట క్వాలిటీ కంట్రోల్ డీఈ అశోక్ దగ్గరుండి కాంక్రీట్ పోయిస్తున్నారు. కాంట్రాక్టర్ సైతం రాత్రి వేళ అక్కడే మకాం వేసి పనులు జరిగేలా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణం చల్లబడితేనే పనులు ఊపందుకోనున్నాయి.



సహజ ప్రసవాలతోనే మహిళలకు ఆరోగ్యం

సూర్యాపేట: మహిళలకు సహజ ప్రసవాలు ఆరోగ్యదాయకమని డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సూర్యాపేట జిల్లా పరిధిలోని సూపర్‌వైజర్లు, పల్లె దవాఖానా వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నలుగురు ప్రత్యేక అధికారులను నియమించి అన్ని శాఖల సమన్వయంతో వైద్య ఆరోగ్య దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా పరిధిలోని అన్ని గ్రామాల్లో సహజ ప్రసవాలపై అవగాహన పెంచాలని అన్నారు. తల్లిపిల్ల ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ సాహితి, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వాతీనక్షత్ర నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అర్చనలు చేపట్టారు. అనంతరం స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవ నిర్వహించి కల్యాణం జరిపారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహా నివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు పద్మనాభాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న మహారాష్ట్ర రైతులు


ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని మహారాష్ట్రకు చెందిన సర్పంచ్‌లు, రైతుల బృందం ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్ రెడ్డి, శాసన మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న మహారాష్ట్ర రైతులు, సర్పంచ్‌లతో పాటు విప్ సునిత, శాసన మండలి విప్ కౌశిక్‌రెడ్డిలకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణాన్ని వారు పరిశీలించారు. తెలంగాణలో ప్రతి ఇంటికి నీరు వస్తుందని, మహారాష్ట్రలో తాగడానికి నీళ్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు, సర్పంచ్‌లు తెలిపారు. మహారాష్ట్రలో పత్తికి గిట్టుబాటు ధర లేక రైతులు ఇంట్లోనే పెట్టుకోవడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో సర్పంచ్ పరిషత్ ముంబై ప్రెసిడెంట్ దత్త కక్షే, బాల సనాబ్, వికాస్ జాదవ్, గణేష్ పాటిల్, సుష్మ దుశ్లే, చౌదరి, పర్వీన్ కిరొడకర్, కల్యాణి పాటిల్ తదితరులున్నారు.

బంగారు గొలుసు చోరీ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో పుస్తెల తాడును చోరీ చేశారు. ఈ ఘటన భువనగిరిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని తాతానగర్‌కు చెందిన శాగంటి లక్ష్మమ్మ ఉదయం ఒంటరిగా అదే వీధిలో నడుచుకుంటూ వెళ్తోంది.ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలోని రూ. 2.40 లక్షల విలువ చేసే నాలుగు తులాల బంగారు గొలుసు అపహరించుకుని పారిపోయాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు రాగా అప్పటికే దుండగుడు పారిపోయాడు. ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డు అయింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ Flat for sale @Nalgonda Town Ready to Occupy 2&3 bhk as per Vasthu good Ventilation, Carparking. Ph: 9030195000, 9030009059 [H-778999]

LAND FOR SALE

■ 5ఎకరాలు అగ్రికల్చర్/ఫామ్ ల్యాండ్ అమ్మకానికి కలదు. మిర్యాలగూడ నుండి 16km, వేములపల్లి మండలము నుండి 7km, 100ft సూర్యాపేట రోడ్‌కి 2nd బిట్, సూర్యాపేట నుండి 23km, LBనగర్ 138km. 8179622234. [HA-11228]

Wanted

■ Wanted Delivery Exe 20Ltr Water Jars Delivery in Kodad. Sal.: 15000 + ESI + PF Ph: 9505258888. [HA-10581]

■ సూపర్‌వైజర్లు, హెల్పర్లు, హౌస్ కీపింగ్ బాయ్స్, రైల్వే స్టేషన్, హోటల్, ఆఫీసుల్లో క్లీనింగ్ వర్కర్స్ కావలెను. బయోడేటా వాట్సాప్ చేసి ఫోన్ చేయండి. RSR. Cell : 77029 59468 [V- 1935]

■ హైదరాబాద్ 5స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ & గర్ల్స్, హెల్పర్స్/సె॥గార్డ్స్, సూ॥ వైజర్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ. 15000-30000. ఫోన్.7981515640,9989930582, [H-781310]

■ కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట మండలంలోని ప్రముఖ సిమెంట్ ఫ్యాక్టరీలో మా సంస్థ అయిన సత్యా ఇన్వెస్టిగేషన్ & సెక్యూరిటీ సర్వీసెస్, గుంటూరు తరుపున పనిచేయుటకు మంచి దేహదారుఢ్యము కలిగిన సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ అర్హతలు: వయస్సు: 30-45 సం॥, అర్హత, ఇంటర్/డిగ్రీ, ఎత్తు : 05.06పైన రిటైర్డ్ ఆర్మీ, పారా మిలటరీ వారికి ప్రాధాన్యత. సెక్యూరిటీ గార్డ్ అర్హతలు: వయస్సు: 23-45సం॥ పదవ తరగతి, ఎత్తు: 05-06 ఆపైన సంప్ర॥ 84669 96958, 98665 45944 [G-105]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793440]

■ TATA 709 రికవరీ వెహికిల్ నడుపుటకు హెవీ లైసెన్స్ కలిగిన డ్రైవర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. Kishore Reddy ఫోన్ : 9985400280, 6281523176 [HA-14663]

Services

LOANS

■ సులభంగా లోన్ పొందండి. అతి తక్కువ వడ్డీతో, అన్ని రకాల లోన్స్, ఉద్యోగస్తులు, వ్యాపారులు, వైద్యులు (NRI) సంప్ర॥ JS ఎంటర్‌ప్రైజెస్, ఖమ్మం. భద్రాద్రి కొత్తగూడెం. 8520970781, 7842830781. [M-1221172]

HOTEL FOR SALE

■ Hotel For Sale in Goa at Calangute Beach, 29 Rooms,with Swimming Pool, Bar & Restarurant, Spa, Price 35Cre Call: 9881931111, Broker Excuse. [HA-29536]

DOCUMENTS LOST

■ కసిరెడ్డి శ్రీనితరెడ్డి D/o శ్రీనివాస్‌రెడ్డి నివాసము: క్రిష్ణాకాలనీ, మిర్యాలగూడ టౌన్‌కి చెందిన నాయొక్క ఇంటి డాక్యుమెంట్స్ మిర్యాలగూడ పట్టణంలోని హరివిల్లు అపార్ట్‌మెంట్‌లో కొండా శ్రీనివాస్‌రెడ్డి S/o కోటిరెడ్డి గారి నుండి నేను కొనుగోలు చేసిన ఇంటి నెం. 208కి చెందిన 4405/2011 నెంబరు గల డాక్యుమెంట్స్ 20.05.2023న ఇంటి నుండి బస్టాండుకి ఆటోలో వెళ్తుండగా ఎక్కడో పడిపోయినవి. దొరికిన వారు ఈ ఫోన్ నెంబరుకి తెలియజేయగలరు. ఫోన్: 6281320082 [Y-784212]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందం చాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.